క్లుప్తంగా

అయోధ్య ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం



వివరాలు వెల్లడిస్తున్న పీఠాధిపతి వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్

ఝరాసంగం(జహీరాబాద్): అయోధ్యలో నిర్మించిన రామమందిర ఆలయ ప్రారంభోత్సవానికి దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వరస్వామికి ఆహ్వానం లభించింది. ఈ విషయాన్ని బుధవారం ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, ట్రస్టు చైర్మన్ అల్లాడి వీరేశం ఆహ్వాన వివరాలను వెల్లడించారు. దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతిని అయోధ్య శ్రీరామ జన్మభూమి ట్రస్టు ఆహ్వానించడం సంతోషకరమన్నారు.

రైతుల కోసమే ఫార్మేషన్ రోడ్డు



ఫార్మేషన్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మీనాక్షి

మునిపల్లి(అందోల్): పొలాలకు వెళ్లే రైతుల కోసమే ఫార్మేషన్ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు జెడ్పీటీసీ మీనాక్షి తెలిపారు. బుధవారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శివారు తుగుం బిచ్చయ్య పొలం నుంచి గాండ్ల సంగమేశ్వర్ పొలం వరకు చేపట్టిన ఫార్మేషన్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పొలాలకు వెళ్లేందుకు లింక్ రోడ్డు నిర్మిస్తున్నట్లు జెడ్పీటీసీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జాస్మిన్, గుడ్డు పటేల్, ఉపసర్పంచ్ తుడుం శాంతమ్మ, వార్డు సభ్యుడు సురేశ్, విద్యాకమిటీ చైర్మన్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ అమీర్ తదితరులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని టేకూర్ గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. సీసీ రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్టు మినరల్ ఫౌండేషన్ కమిటీ) కింద ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేసింది. మంజూరైన నిధులతో గ్రామంలోని 1వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ అమీర్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ సంతోష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

నారాయణఖేడ్: మండలంలోని ఆకుల లింగాపూర్ గ్రామంలో శ్రీకృష్ణ దేశిక స్వాములవారి 94వ పుణ్యతిథిని పురస్కరించుకొని బుధవారం స్వాములవారి ఆరాధన, ధ్వజారోహణ, అభిషేకం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజన, అన్నప్రసాద వితరణ, నారాయణదాస్ హరికథా కాలక్షేపం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శ్రీసిద్ధేశ్వర స్వామి దేవాలయ హుండీని బుధవారం దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం రూ.1,71,637 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

పటాన్‌చెరు టౌన్: బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గొల్లపల్లి వీరేశం హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్ 10లో భాగంగా బుధవారం అమీన్‌పూర్ పరిధి బీరంగూడలోని స్నేహా ఫ్రెష్ చికెన్ సెంటర్‌లో పని చేస్తున్న బాలుడిని గుర్తించి యజమాని మల్లికార్జున్‌పై, అలాగే రాఘవేంద్ర టిఫిన్ సెంటర్‌లో పని చేస్తున్న బాలుడిని గుర్తించి యజమాని సురేందర్ బాటిపై కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

- పాఠశాలల్లో మౌలిక వసతులపై నివేదిక ఇవ్వండి
- సమావేశానికి హాజరుకానివారికి నోటీస్ ఇవ్వాలని ఆదేశం
- విద్య, వైద్యశాఖల్లో డిప్యుటేషన్లు రద్దు చేయండి
- ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): విద్యుత్ స్తంభాలు వేసి నాలుగేళ్లయినా వైర్లు ఎందుకు వేయలేదంటూ విద్యుత్ అధికారులపై ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షురాలు సంగీత అధ్యక్షతన జరిగిన కంగ్టి ఎంపీపీ సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. ఎన్నికల వరకే పార్టీలు, అనంతరం అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలన్నారు. పల్లె ప్రగతిలో విద్యుత్ స్తంభాలు వేసి ఇప్పటి వరకు వైర్లు ఎందుకు వేయలేదని ముకుంద తండా సర్పంచ్ సురేఖ రాథోడ్ సభలో ప్రస్తావించడంతో లైన్ ఇన్‌స్పెక్టర్ బాబుపై ఎమ్మెల్యే మండిపడ్డారు. విద్యుత్ శాఖలో ఐదేళ్లుగా చేసిన అభివృద్ధి పనుల నివేదిక ఇవ్వాలన్నారు. విద్యుత్, పంచాయతీ రాజ్ ఈఈలు సమావేశానికి గైర్హాజరు కావడంతో వారికి నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓ ఆదేశించారు. అగ్రికల్చర్, హార్టికల్చర్ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు లేవని సభ్యులు ప్రస్తావించగా పాఠశాలల సమాచారం తమకు పంపాలన్నారు. విద్య, వైద్యశాఖల్లో డిప్యుటేషన్లు రద్దు చేయాలన్నారు. పార్టీలకతీతంగా తాను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే అయిన వెంటనే ఏమైనా కొమ్ములొస్తాయా? అంటూ ఆవేశంగా మాట్లాడారు. పీహెచ్‌సీ వైద్యాధికారి నాగమణి అందుబాటులో ఉండటం లేదని సభ్యులు సభలో ప్రస్తావించడంతో రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తున్న తమపై తప్పుడు ఫిర్యాదు చేయడంపై మెడికల్ ఆఫీసర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విభేదాలు పక్కనపెట్టి అధికారులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి పాటుపడాలని ప్రజాప్రతినిధులకు కోరారు. అనంతరం ఎమ్మెల్యేను ఎంపీపీ అధ్యక్షురాలు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లలిత, మండల రైతు సమన్వయకర్త కోట ఆంజనేయులు, ఎంపీపీ ఉపాధ్యక్షుడు రేఖాపాటిల్, తహసీల్దార్ విష్ణుసాగర్, ఎంపీడీఓ ముజఫరొద్దీన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏపీఎం, ఏపీఓ, ఏఈ ఇరిగేషన్ మైలారం రవి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): / పటాన్‌చెరు: నిరుపేద కుటుంబాలకు ఆడబిడ్డ పెళ్లి భారం కాకూడదని మాజీ సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం గుమ్మడిదల మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు రూ.7 లక్షల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగా భవాని పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

నారాయణఖేడ్: పార్టీలకతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలను అందించడానికి కృషి చేస్తున్నట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో బుధవారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 70 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్ పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్‌రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 55 మందికి చెక్కులు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ విష్ణుసాగర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జుబేర్ అహ్మద్, మాజీ జెడ్పీటీసీ సర్దార్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ నిరూపించుకునేందుకే టోర్నీలు



బసంత్‌పూర్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామీణ యువకులు క్రీడల్లో తమ ప్రతిభ నిరూపించుకునేందుకు టోర్నీలు దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బసంత్‌పూర్ గ్రామంలో బీఎస్‌ఆర్ క్రికెట్ టోర్నీని బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన యువకులు ఉన్నారని, వారి ప్రతిభను వెలికితీసేందుకే క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. టోర్నీలో విజేత జట్టుకు ప్రథమ బహుమతి కింద రూ.20 వేలు, కప్పు, రన్నర్‌రప్ జట్టుకు ద్వితీయ బహుమతి కింద రూ.10 వేలు, కప్పు బహూకరిస్తామన్నారు. కార్యక్రమంలో అబ్బాస్, జీవన్, జగనాథ్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత



చెక్కు అందజేస్తున్న మిత్రులు

నారాయణఖేడ్: చిన్ననాటి స్నేహితుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మిత్రులు అతడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి ఉదారత చాటుకున్నారు. తుర్కపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్ ఖేడ్‌లోని షాపింగ్‌మాల్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 7వ తేదీన విధులు ముగించుకొని రాత్రి బైక్‌పై ఇంటికి వస్తుండగా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధి చాంద్‌ఖాన్‌పల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. వెంకటేశ్‌ది నిరుపేద కుటుంబం కావడంతో చిన్ననాటి స్నేహితులు రూ.1.2 లక్షలు పోగుచేసి బుధవారం అతడి కుటుంబానికి చెక్కు రూపంలో అందజేశారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నాయకులు



నిరసన తెలుపుతున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మసంఘం నాయకులు

నర్సాపూర్‌రూరల్: హైదరాబాద్ ఎల్లమ్మబండ వద్ద ప్రొఫెసర్ జయశంకర్‌సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నర్సాపూర్‌లో సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల భిక్షపతి చారి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మాట్లాడుతూ.. తెలంగాణ దశ దిశ చూపిన ఒక గొప్ప మహా వ్యక్తిని విగ్రహాన్ని కూల్చడం బాధాకరం అన్నారు. విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కమ్మరి కృపాచారి, వడ్ల భాస్కర్ చారి, లింగం చారి, సదానందం చారి, ప్రవీణ్ చారి, నరసింహ చారి, శివచారి, నాగరాజ్ చారి, శ్రీకాంత్ చారి, నరేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గజ్వేల్‌రూరల్: శ్రీరామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతలకు బుధవారం బహుమతుల పంపిణీ చేపట్టారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా శ్రీరామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో తాలుకా స్థాయిలో నిర్వహించిన ముగ్గుల పోటీలో 436 మంది మహిళలు పాల్గొనగా ఇందులో గెలుపొందిన పలువురికి పట్టణంలోని మురళీకృష్ణాలయంలో బహుమతులు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు చాటిచెబుతూ ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్న రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర బాధ్యులు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, దేవాలయ కమిటీ సభ్యులు రామచంద్రం, మైత్రాములు, లక్ష్మయ్య, మధు, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలి

పటాన్‌చెరు టౌన్: తనతోపాటు తన సోదరుడిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ డీఎస్ కాలనీకి చెందిన నవీన్ కుమార్ ఈనెల 15వ తేదీ రాత్రి సంక్రాంతి పండుగ సందర్భంగా స్నేహితులతో కలిసి మద్యం తాగేందుకు కూర్చున్నాడు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన రాజు మద్యం మత్తులో నవీన్‌ను దుర్భాషలాడాడు. మద్యం మత్తులో ఉన్నావంటూ రాజును వెళ్లమని నవీన్ కోరాడు. అతడు వెళ్లకుండా తన స్నేహితులకు ఫోన్ చేయడంతో 20 మంది వచ్చి నవీన్, అతడి సోదరుడు షణ్ముఖ్, భగత్, మహేష్, నవీన్‌రెడ్డి, సంతుపై దాడి చేశారు. గాయపడ్డ నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

క్రీడాకారులకు వసతుల కల్పన

పటాన్‌చెరు టౌన్: 34వ మైత్రి క్రికెట్ ట్రోఫీ టోర్నమెంట్ ఆడేందుకు వస్తున్న క్రీడాకారులకు వసతులు కల్పిస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ బుధవారం తెలిపారు. అలాగే పట్టణంలోని మైత్రి మైదానంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న టోర్నమెంట్ దృష్ట్యా పారిశుద్ధ్య పనులు చేయించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పటాన్‌చెరు టౌన్: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సంఘటన పటాన్ చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కందుకూరుకు చెందిన మాల్యాద్రి బతుకుదెరువు కోసం పటాన్‌చెరులోని గౌతంనగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నాడు. జనవరి 3వ తేదీన తన స్వగ్రామానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. వారంతా సంక్రాంతి పండుగనాడు అక్కడే ఉండిపోయారు. 16వ తేదీ ఉదయం ఇంటి యజమాని వెంకటేశ్వర్లు మాల్యాద్రికి ఫోన్ చేసి ఇంట్లో దొంగలు పడినట్లు సమాచారం ఇచ్చాడు. బుధవారం పటాన్‌చెరుకు చేరుకున్న మాల్యాద్రి ఇంటికి వెళ్లి చూడగా బీరువాలో దాచుకున్న రూ.22 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రహించి పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గీతం అధ్యాపకుడికి సెర్చ్ పరిశోధనా ప్రాజెక్టు



డాక్టర్ సుధాకర్ సింఘా

పటాన్‌చెరు: గీతం విశ్వవిద్యాలయంలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుధాకర్ సింఘాకు భారత ప్రభుత్వం సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్ (సెర్చ్) పరిశోధనా ప్రాజెక్టు మంజూరు చేసినట్లు బుధవారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్ జిల్లాలో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ ఆధారంగా భూగర్భ జలాల గుణాత్మక, పరిమాణాత్మక మూల్యాంకనం ప్రాజెక్టుతోపాటు రూ.32.03 లక్షల గ్రాంట్‌తో సెర్చ్ రీసెర్చ్ గ్రాంట్ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి, తదితరులు డాక్టర్ సింఘాను అభినందించారు.

ఆ భూములు ఇతరులకు కేటాయించొద్దు



ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న బాధితులు

జహీరాబాద్: ప్రభుత్వం తమకు కేటాయించిన భూములను ఇతరులకు కేటాయించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను విరమించుకోవాలని బాధితులు అధికారులను కోరారు. ఈమేరకు బుధవారం జహీరాబాద్‌లోని గడీ కాలనీకి చెందిన లబ్ధిదారులు ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. 1980లో అప్పటి ప్రభుత్వం సర్వేనంబర్ 337లో తమకు వ్యవసాయ భూములు కేటాయించిందన్నారు. అప్పటి నుంచి సాగు చేసుకుని జీవనం సాగిస్తుండగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకుని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిందని, దీంతో తాము కోర్టును ఆశ్రయించడంతో ఇళ్ల నిర్మాణం ఆగిపోయిందన్నారు. ఆ కేసు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. కాగా ఆ భూములు ఇతరులకు కేటాయించే ప్రయత్నాలు చేస్తున్నారని, దానిని అడ్డుకొని తమకు న్యాయం జరిగేలా చూడాలని వినతి పత్రంలో కోరారు.

కేంద్ర పథకాలపై అవగాహన



వికసిత్ భారత్ సంకల్ప యాత్ర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

జహీరాబాద్: పట్టణంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని అధికారులు బుధవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలు ఏమేరకు లబ్ధిపొందుతున్నారనే విషయాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పి.శ్రీనివాస్‌గుప్తా, అప్పం రమేష్, పద్మ, రవికుమార్ శెట్కార్, వీరన్న, వెంకటరాంరెడ్డి, వెంకటేశం, రాణి పాల్గొన్నారు.

గౌడ కులసంఘ భవన నిర్మాణానికి కృషి

సంగారెడ్డి టౌన్: గౌడ కుల సంఘ భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులకు ఎమ్మెల్యే హరీశ్ రావు సహకారంతో గౌడ సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు.

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు చాలా విలువైనది

అందోల్ ఆర్డీఓ పాండు

జోగిపేట(అందోల్): ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని, 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని అందోల్-జోగిపేట ఆర్డీవో పాండు సూచించారు. ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా జోగిపేటలోని క్లాక్ టవర్ నుంచి అందోల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 20, 21 తేదీలలో కొత్త ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంథోని డియోనిసియో, ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్, లెక్చరర్ గోపాల్, ఏఎస్‌ఐ గౌస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వినయ్, మున్సిపల్ సిబ్బంది భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహనకు 2కే రన్

రాయికోడ్(అందోల్): ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు అధికారులు బుధవారం 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి గ్రామంలోని ప్రధాన రహదారి గుండా ఈ రన్ సాగింది. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటర్లు ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశం, డీటీ విజయ్ కుమార్, ఏఎస్‌ఐ ఇక్బాల్ హుస్సేన్, ఆర్‌ఐలు రాంచందర్, ప్రభాకర్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



రాయికోడ్‌లో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న అధికారులు

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటుహక్కు అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

పటాన్‌చెరు టౌన్: 2024, జనవరి1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని పటాన్‌చెరు తహసీల్దార్ భాస్కర్ సూచించారు. బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు పటాన్‌రు పట్టణంలోని మైతి గ్రౌండ్ నుంచి రామచంద్రాపురం వరకు ఓటుహక్కుపై బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఈనెల 22 వరకు ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ తహసీల్దార్ గౌరీ వత్సల, పటాన్‌చెరు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, పటాన్‌చెరు ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్ సంతోష్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్ కార్తీక్, డిప్యూటీ తహసిల్దార్ విశ్వేశ్వర్, అమీన్‌పూర్ డిప్యూటీ తహసిల్దార్ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.